బీసీ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఆర్ కృష్ణయ్య

బీసీ సమస్యలు పక్కదారి పట్టించేందుకు రేవంత్ కుట్ర: ఆర్ కృష్ణయ్య

ముషీరాబాద్, ఫిబ్రవరి 15: తప్పుతడకగా సాగిన బీసీ జనగణనను పక్కదారి పట్టించేదుకే ప్రధాని నరేంద్రమోదీ కులం అంశాన్ని సీఎం రేవంత్ తెరపై తీసుకొచ్చారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య విమర్శించారు. మోదీ బీసీ కాదనీ, కన్వర్టెడ్ బీసీ అని రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. శనివారం హైదరాబాద్ విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో బీసీ సంఘాల ప్రతినిధులతో కలిసి ఆర్ కృష్ణయ్య మీడియాతో మాట్లాడారు. మోదీ కులంపై చేసిన వ్యాఖ్యలు దేశంలోని బీసీలకు కించపర్చడం, అవమానపర్చడమేనని, బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీసీ ప్రధానిగా గొప్పగా రాణిస్తుంటే అగ్రవర్గాలు జీర్ణించుకోలేకపోతున్నాయని విమర్శించారు. దేశంలో బీసీలకు రక్షణ కల్పించేందుకు జాతీయ బీసీ కమిషన్‌కు మోదీ రాజ్యాంగబద్ధత కల్పించారని, విస్తృత అధికారాలు ఇచ్చారని చెప్పారు. రాష్ట్రంలో బీసీలు తీవ్ర నిర్లక్ష్యానికి, అన్యాయానికి గురవుతున్నారని, రేవంత్ సర్కారు బీసీ జనగణన అసంబద్ధంగా చేసిందని మండిపడ్డారు. బీసీలపై రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే 80 ప్రశ్నలతో కాకుండా 3 ప్రశ్నలతో ఇంటింటి రీసర్వే చేయించాలని స్పష్టంచేశారు. 42 శాతం బీసీ రిజర్వేషన్‌లు అమలు చేయాలని, కేంద్రం మీదకు తొసి ఊరుకుంటామంటే సహించేదిలేదని హెచ్చరించారు. సమావేశంలో బీసీ సంఘాల నేత కొండా దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

28 వరకు కులగణనకు అవకాశం

- మండల పరిషత్‌లోనూ నమోదు చేసుకోవచ్చు
- ప్రభుత్వ వైఖరిని తప్పబడుతున్న బీసీ సంఘాల నాయకులు

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): కులగణనలో పాల్గొనని 3,56,323 కుటుంబాలకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. నేటి నుంచి ఈ నెల 28 వరకు వివరాలు నమోదు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. ఇందుకోసం టోల్‌ఫ్రీ నంబర్ 040-21111111ను అందుబాటులోకి తెచ్చినట్టు చెప్పారు. ఈ నంబర్‌కు ఫోన్ చేస్తే ఎన్యుమరేటర్లు వారి ఇండ్లకు వెళ్లి వివరాలు సేకరించనున్నట్టు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయాల్లోనూ కుటుంబసభ్యుల వివరాలు చెప్పవచ్చని వెల్లడించారు. seeepcsurvey. cgg. gov.in వెబ్‌సైట్ నుంచి సర్వే ఫామ్‌ను డౌన్‌లోడ్ చేసుకొని వివరాలు నమోదు చేసి ఆయా గ్రామాల ప్రజాపాలన కేంద్రాల్లోనూ ఇవ్వవచ్చని సూచించారు.

సర్కారు చెప్పిందొకటి.. చేసేదొకటి

రాష్ట్రంలో కులగణనలో పాల్గొనని వారి వివరాల నమోదుకు రీసర్వే నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఎన్యుమరేటర్ల ద్వారా ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తామని ఈ నెల 12న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. ఈ నెల 16 నుంచి 28 వరకు రీసర్వే చేస్తామని వెల్లడించారు. కానీ ఇప్పుడు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నది. టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్‌చేస్తేనే ఎన్యుమరేటర్లు వారి ఇండ్లకు వెళ్లి కుటుంబ వివరాలు సేకరిస్తారని, లేదంటే మండల పరిషత్ కార్యాలయాలకు వెళ్లి నమోదు చేసుకోవాలని మెలికపెట్టింది. ప్రభుత్వ వైఖరిని బీసీ సంఘాల నాయకులు తప్పుబడుతున్నారు. ప్రభుత్వం పునరాలోచించి ఎన్యుమరేటర్ల ద్వారా తిరిగి సర్వే నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు.

జనాభా ప్రకారమే రిజర్వేషన్లు కల్పించాలి

విద్య, ఉపాధి, రాజకీయంగా వేర్వేరు బిల్లులను పెట్టాలి

- కుల సర్వే పూర్తిస్థాయి నివేదికను అసెంబ్లీలో పెట్టాలి
- డెడికేటెడ్ కమిషన్ నివేదికను బహిర్గతం చేయాలి
- బీసీ సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశంలో కవిత
- లక్కినేని సురేందర్‌కు ఖమ్మం జైలులో పరామర్శ

ఖమ్మం, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాల్సిందేనని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో శనివారం ఖమ్మంలోని సప్తపది ఫంక్షన్‌హాల్‌లో బీసీ సంఘాలతో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన తప్పుడు లెక్కల ప్రకారం చూసినా రాష్ట్రంలో బీసీలు 46శాతం ఉన్నారని, రీ సర్వే చేస్తే మరో 1.5 లేదా 2 శాతం పెరుగుతారని తెలిపారు. ఆ లెక్కన బీసీలు 48శాతం ఉంటే... ఏ ప్రాతిపదికన 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తారని ప్రశ్నించారు. స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, కానీ విద్యా, ఉపాధి రంగాలకు కలిపి ఒకే బిల్లు పెడితే న్యాయపరమైన చిక్కులు వస్తాయని అభిప్రాయపడ్డారు. ఏ ఒక్క అంశంపై ఎవరైనా కోర్టుకు వెళ్తే మొత్తం బిల్లు చెల్లకుండాపోతుందని హెచ్చరించారు. వేర్వేరు బిల్లులను పెట్టాలని డిమాండ్ చేశారు. ముస్లింలు, బీసీలకు కలిపి 56 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని ప్రతిపాదించారు. రిజర్వేషన్ల విషయంలో హిందువులు, ముస్లింల మధ్య బీజేపీ చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్నదని ధ్వజమెత్తారు. బీసీల అభివృద్ధికి బీఆర్ఎస్ ఎంతగానో కృషి చేసిందని, అందులో భాగంగానే పార్టీ పదవుల్లో ఆ వర్గాల వారికి 51 శాతం అవకాశాలు కల్పిస్తున్నదని గుర్తుచేశారు. తెలంగాణ జాగృతి సంస్థ బీసీలకు న్యాయం కోసం పోరాటం చేస్తుందని, సామాజిక దృక్పథంతో పనిచేస్తున్నదని చెప్పారు.

బీసీ సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, చిత్రంలో ఎంపీ వద్దిరాజు, మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, ఆర్జేసీ కృష్ణ

అక్రమ కేసులకు తలొగ్గేదే లేదు..

ఏ కారణం లేకుండా బీఆర్ఎస్ కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేస్తున్నారని, ప్రజాక్షేత్రంలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న నాయకులను టార్గెట్ చేస్తున్నారని కవిత ధ్వజమెత్తారు. ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపిన బీఆర్ఎస్ కార్యకర్త లక్కినేని సురేందర్‌ను ఆమె ఖమ్మం జైలులో శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని ప్రభుత్వం దుర్వినియోగం చేస్తున్నదని మండిపడ్డారు. అక్రమ కేసులతో కేసీఆర్ సైన్యాన్ని కట్టడి చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తున్నదని, కానీ కేసీఆర్‌ను, కేసీఆర్ సైన్యాన్ని కట్టడి చేయడం ఎవరికీ సాధ్యం కాదని తేల్చిచెప్పారు. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రశ్నించకుండా తమను ఆపలేరని అన్నారు. గ్రామ సభల్లో ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించినందుకు సురేందర్‌పై అక్రమ కేసు నమోదు చేసి జైలు పంపారని మండిపడ్డారు. అనంతరం పాండురంగాపురంలో జరిగిన సంత్‌శ్రీ సేవాలాల్ జయంతి వేడుకల్లో కవిత పాల్గొన్నారు. గిరిజనులు వారి సంప్రదాయ పద్ధతిలో ఆమెకు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కవిత ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యేలు మదన్‌లాల్ హరిప్రియనాయక్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు అన్యాయం

చౌటుప్పల్ రూరల్/చిట్యాల, ఫిబ్రవరి 15: కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలు, రైతులు, విద్యార్థులు ఇలా ఏ ఒక్క వర్గానికీ సంక్షేమ పథకాలు అందడం లేదని, ఇది పూర్తిగా సంక్షోభ ప్రభుత్వంగా మారిపోయిందని తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు, ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. ఖమ్మంలో బీసీ నాయకులతో నిర్వహించనున్న రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొనేందుకు వెళ్తున్న ఎమ్మెల్సీ కవితకు చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెంలో మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం చిట్యాలలో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు కవితను స్వాగతించి సన్మానించారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో కవితకు గొర్రె పిల్లను బహూకరించారు. కవిత మీడియాతో మాట్లాడుతూ.. ట్రిపుల్ ఆర్ రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు వారిని పట్టించుకోవడం లేదని విమర్శించారు. బీఆర్ఎస్ నాయకత్వంలో రైతులకు న్యాయం జరిగే వరకూ కృషి చేస్తామని చెప్పారు. స్వాగతం పలికినవారిలో చౌటుప్పల్ మాజీ జడ్పీటీసీ బుచ్చిరెడ్డి, నాయకుడు గిర్కటి నిరంజన్‌గౌడ్, సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, బొళ్ల శివకుమార్, ఢిల్లీ మాధవరెడ్డి, మాచర్ల కృష్ణ, ఉడుగు మల్లేశం, చిన్నం బాలరాజు, గడ్డం యాదగిరి, మెరుగు శ్రీనివాస్, రామకృష్ణ, పిల్లలమర్రి సాయి, బీఆర్ఎస్ చిట్యాల పట్టణ అధ్యక్షుడు పొన్నం లక్ష్మయ్య, నాయకులు సునీత, కన్నెబోయిన జ్యోతి బలరాం, జడల ఆదిమల్లయ్య, కూరెళ్ల లింగస్వామి, మెండె సైదులు, కొలను సతీశ్, సుంకరి యాదగిరి, బాలగోని రాజు, జిట్ట శేఖర్, ఆగు అశోక్, రాములు ఉన్నారు.

సంత్ సేవాలాల్ జయంతి సందర్భంగా గిరిజన సంప్రదాయ పద్ధతిలో బిందెలు నెత్తిపై ధరించి పూజల్లో పాల్గొన్న కవిత

కేసీఆర్‌పై కోపంతో.. తెలంగాణకు నష్టం చేస్తున్న రేవంత్

- గోదావరిపై ప్రాజెక్టులను నిలిపేస్తే రాష్ట్ర భవిష్యత్తుకు ప్రమాదం
- ఖమ్మంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

ఖమ్మం, ఫిబ్రవరి 15 (నమస్తేతెలంగాణ ప్రతినిధి): కేసీఆర్‌పై కోపం పెంచుకున్న సీఎం రేవంత్‌రెడ్డి.. తెలంగాణ ప్రజలకు తీరని అన్యాయం చేస్తున్నారని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. తెలంగాణలో గోదావరిపై నిర్మిస్తున్న ప్రాజెక్టులను నిలిపివేయడం ద్వారా రాష్ట్ర ప్రజలకు తీరని అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. ఖమ్మంలో శనివారం పర్యటించిన ఆమె.. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర నివాసంలో పాత్రికేయులతో మాట్లాడారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతుల సాగునీటి అవసరాలను తీర్చడంతోపాటు గోదావరి, కృష్ణా జలాలను అనుసంధానం చేసే నీతారామ ఎత్తిపోతల నిర్మాణాలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఏపీ ప్రభుత్వం లంకచర్ల వద్ద 1090 టీఎంసీల సామర్థ్యంతో ప్రాజెక్టును నిర్మిస్తే తెలంగాణ ప్రజల గతి ఏమి కావాలని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి కురచ రాజకీయాలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులున్నా ఎలాంటి ఉపయోగమూ లేదని విమర్శించారు. మేడిగడ్డ, దేవాదుల ప్రాజెక్టుల్లోని నీటిని వినియోగించకుండా రైతులను నట్టేట ముంచుతున్నారని ఆరోపించారు. కృష్ణా జలాలను వినియోగించుకోవడంలో సీఎం రేవంత్‌రెడ్డి విఫలమయ్యారని విమర్శించారు. తన సొంత జిల్లాకు కూడా సాగునీరు ఇచ్చే స్థితిలో సీఎం లేరని ధ్వజమెత్తారు.

ఉచితాలపై అనవసర రాద్ధాంతం

ఎమ్మెల్యే కూనంనేని

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): దేశవ్యాప్తంగా ఉచిత పథకాలపై అనవసర రాద్ధాంతం చేస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. శనివారం మగ్దూంభవన్‌లో పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు తక్కెళ్లపల్లి శ్రీనివాస్‌రావుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. పేదలు రక్తం ధారపోసి సంపద సృష్టించి జీఎస్టీ రూపంలో చెల్లిస్తున్న డబ్బులనే ప్రభుత్వాలు సంక్షేమానికి వినియోగిస్తున్నాయని, అలాంటప్పుడు సంక్షేమ పథకాలను ఉచితాలని పేర్కొనడం అర్థరహితమని పేర్కొన్నారు. ఉచితాలు ఇవ్వడం తప్పంటూ ప్రధాని మోదీతోపాటు జయప్రకాశ్‌నారాయణ్ లాంటి కొందరు మేధావులు స్వార్థ ప్రయోజనాల కోసం మాట్లాడుతున్నారని మండిపడ్డారు. వారికి కొందరు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు వంతపాడటం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు.

వక్ఫ్‌బోర్డు సీఈవో తొలగింపుపై స్టే

సింగిల్ జడ్జి ఉత్తర్వులపై హైకోర్టు

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): వక్ఫ్‌బోర్డు సీఈఓ అసదుల్లాను తక్షణం తొలగించాలంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులపై హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం స్టే ఇచ్చింది. సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాలు చేస్తూ మైనార్టీ సంక్షేమ శాఖ తోపాటు, సీఈఓగా అసదుల్లా, సయ్యద్ అజ్మతుల్లా అప్పీలు దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ అభినంద్ కుమార్ షావిలి, జస్టిస్ ఈ తిరుమలాదేవితో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. అడ్వకేట్ జనరల్ ఏ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ సీఈఓ నియమాకానికి చర్యలు చేపడతామని, సింగిల్‌జడ్జి ఉత్తర్వుల అమలును నిలిపివేయాలని కోరారు. దీనికి ధర్మాసనం అనుమతిస్తూ వక్ఫ్‌బోర్డు సీఈఓను తక్షణం తొలగించాలన్న ఉత్తర్వుల అమలును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. ప్రతివాదులైన మహమ్మద్ అక్బర్, జహంగీర్‌ఖాన్‌కు నోటీసులు జారీచేస్తూ విచారణను మార్చి 12కు వాయిదా వేసింది.

'గొర్రెల కాపరుల'కు చెక్కుల పంపిణీ

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో వివిధ ప్రమాదాలతో చనిపోయిన ముగ్గురు గొర్రెల కాపరుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున ఎక్స్‌గ్రేషియా చెక్కులను గొర్రెల, మేకల అభివృద్ధి సమాఖ్య ఎండీ సుబ్బారాయుడు శనివారం అందజేశారు. ప్రభుత్వం నుంచి అందిన సహకారాన్ని బాధిత కుటుంబాలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్, అధికారులు మనోజ్‌కుమార్, మధు, సిద్ధార్థ్, జాన్, వీరేంద్ర మోహన్, బాధిత కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతలపై కేసు కొట్టివేత

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): ఎన్నికల నిబంధనల ఉల్లంఘనకు సంబంధించి కాంగ్రెస్ నేతలు ఏఐసీసీ కార్యదర్శులు పీ విష్ణువర్ధన్, మన్సూర్‌అలీఖాన్‌పై నమోదైన కేసును హైకోర్టు కొట్టివేసింది. 2023 నవంబరు 22న కాంగ్రెస్ అభ్యర్థి కోట నీలిమ నేతృత్వంలో ధర్నా నిర్వహించారు. ధర్నాలో విష్ణువర్ధన్, మన్సూర్‌అలీఖాన్ కూడా పాల్గొన్నారు. ఎలాంటి అనుమతుల్లేకుండా ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలిగించడంపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై సికింద్రాబాద్ కోర్టులో 2024లో అభియోగ పత్రం దాఖలు చేశారు. ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ విష్ణువర్ధన్, మన్సూర్‌అలీఖాన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కే సుజన విచారణ చేపట్టారు. సరైన ఆధారాలు, సాక్ష్యాలు లేనందున కేసును కొట్టివేస్తున్నట్టు ఉత్తర్వులు జారీచేశారు.

కాంగ్రెస్ డిక్లరేషన్లన్నీ ఉత్తముచ్చట్లే!

మొదటిపేజీ తరువాయి...

నుంచి కామారెడ్డి డిక్లరేషన్ వరకు అన్నీ సజీవసాక్ష్యాలే. కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలకు నిలువెత్తు నిదర్శనాలే. ఆఖరికి నామినెటేడ్ పదవుల భర్తీలోనూ సామాజిక న్యాయానికి తిలోదకాలిచ్చారు..దీనిని బట్టి అట్టడుగువర్గాల అభ్యున్నతిపై ఆ పార్టీ చిత్తశుద్ధి ఏపాటితో అర్థమవుతుంది. కాంగ్రెస్ సర్కారు అనుసరిస్తున్న విధానాలపై బీసీ మేధావులు, కులసంఘాల నేతలు, సామాజికవేత్తలు దుమ్మెత్తిపోస్తున్నారు.

ఉదయ్‌పూర్ డిక్లరేషన్ బోగస్..

కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ సమావేశం 2022 మేలో రాజస్థాన్‌లోని ఉదయపూర్‌లో జరిగింది. నవసంకల్ప్ పేరిట అందరికీ న్యాయం, సామాజిక న్యాయం నినాదాలతో హోరెత్తించింది. పలు తీర్మానాలు చేసింది. ప్రధానంగా ప్రతి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో రెండు స్థానాలను బీసీలకు కేటాయిస్తామని ఊదరగొట్టింది. ఒక కుటుంబం నుంచి ఒకరికి మాత్రమే అవకాశం అంటూ బీరాలు పలికింది. ఉదయ్‌పూర్ డిక్లరేషన్‌ను కచ్చితంగా అమలు చేస్తామని గాంధీభవన్ వేదికగా మరోసారి తీర్మానం చేసింది. కానీ ఆచరణలోనే తూట్లు పొడిచింది. ఉదయ్‌పూర్ డిక్లరేషన్ ప్రకారమే బీసీలకు మొత్తంగా 34 ఎమ్మెల్యే టికెట్లను కేటాయించాల్సి ఉన్నా కేవలం 20 సీట్లు ఇచ్చి చేతులు దులుపుకుంది. వాటిలో ఐదు సీట్లు పాతబస్తీ పరిధిలో ఉన్నాయి. అంటే డిక్లరేషన్‌లో పేర్కొన్న దానిలో నికరంగా సగం కంటే తక్కువ సీట్లను కేటాయించి బీసీలను మోసం చేసింది. 17 పార్లమెంట్ స్థానాలకుగాను మూడు సీట్లనే బీసీలకు కేటాయించింది. ప్రస్తుతం ఎన్నికలు జరుగనున్న మూడు మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో ఏ ఒక్కటీ బీసీలకు కేటాయించలేదు.

అటకెక్కిన కామారెడ్డి డిక్లరేషన్..

'కులగణన, బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోపే బీసీ రిజర్వేషన్లు చట్టబద్ధంగా పెంచుతాం. స్థానిక సంస్థల్లో ప్రస్తుతమున్న 23 శాతం రిజర్వేషన్లను 42 శాతానికి పెంచి 23,973మంది బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పిస్తాం. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల ఉపవర్గీకరణ అమలు చేస్తాం'' ఇదీ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ. కామారెడ్డి వేదికగా ప్రకటించిన డిక్లరేషన్. కానీ దీని అమలులోనూ ఇప్పుడు మాట తప్పింది. రిజర్వేషన్ల పెంపునకు సుప్రీంకోర్టు విధించిన 50 శాతం సీలింగ్ ఆటంకంగా మారిందని సన్నాయినొక్కులు నొక్కుతున్నది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ సాధ్యం కాదని చేతులేత్తయడంతోపాటు పార్టీ పరంగానే రిజర్వేషన్లను కల్పిస్తామని కొత్త నాటకానికి తెరలేపింది. కులగణనకు ఏమైనా చట్టబద్ధత కల్పించిందా అంటే అదీ లేదు. కేవలం అసెంబ్లీలో నోట్‌ను ప్రవేశపెట్టి చేతులు దులుపుకున్నది.

ఏ ఒక్క హామీ అమలుకు నోచుకోలె..

డిక్లరేషన్లు, తీర్మానాలే అటకెక్కగా, ఎన్నికల వేళ ఇచ్చిన హామీల సంగతీ అదేవిధంగా ఉంది. అధికారంలోకి వస్తే బీసీ సంక్షేమానికి ప్రతి ఆర్థిక సంవత్సరం రూ.20 వేల కోట్లు కేటాయిస్తామని, ఐదేండ్లకుగాను లక్ష కోట్లు ఖర్చు చేస్తామని, అలాగే మహాత్మా జ్యోతిబా పూలే పేరుతో బీసీ సబ్‌ప్లాన్ తీసుకొస్తామని మ్యానిఫెస్టోలో పేర్కొన్నది. కానీ నిరుడు బడ్జెట్‌లో బీసీలకు 8000 కోట్లు మాత్రమే కేటాయించింది. బీసీ కార్పొరేషన్‌కు నిరుడు బడ్జెట్‌లో 700 కోట్లను కేటాయించినా ఇప్పటికీ ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇక కల్యాణలక్ష్మి కింద లక్షతోపాటు, తులం బంగారం ఇస్తామని ఊదరగొట్టి ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో అమలు చేసిన బీసీ బంధు పథకాన్ని సైతం అటకెక్కించింది. విదేశీ విద్యానిధి నిధులకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయడం లేదు. ఇప్పటికైనా సర్కారు ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీసీ సంఘాలు, కులసంఘాల నేతలు, మేధావులు డిమాండ్ చేస్తున్నారు.

నామినేటెడ్ పదవుల్లో ద్రోహం..

చట్టసభలు, ఇతర రాజకీయ అవకాశాల సంగతి అలా ఉంచితే నామినేటెడ్ పోస్టుల భర్తీలోనూ కాంగ్రెస్ బీసీలను వంచించింది. ముఖ్యమంత్రి కార్యాలయం మొత్తం అగ్రవర్ణాలకు చెందిన అధికారులతోనే నిండిపోయిందని, కేవలం ఒకే ఒక్క బీసీ, ఎస్సీ అధికారికి మాత్రమే అవకాశమిచ్చారని, కార్పొరేషన్ పదవులన్నీ అగ్రవర్ణాలకు కేటాయిస్తున్నారని బీసీ సంఘాల నేతలు, కాంగ్రెస్ నాయకులే బాహాటంగా విమర్శిస్తున్నారు. ఇప్పటివరకు కార్పొరేషన్లు, ఫెడరేషన్లు కలిపి 38 మందికిపైగా చైర్మన్లను నియమించింది. అందులో కేవలం 8 మంది మాత్రమే బీసీలు ఉన్నారు. వాటిలోనూ 3 కార్పొరేషన్లు బీసీలవే కావడం గమనార్హం. ఇదే విషయమై బీసీ సంఘాల నేతలు తీవ్రంగా మండిపడుతున్నారు. ఇంకా కాంగ్రెస్‌లో సామాజిక న్యాయం ఎక్కడుందో రాహుల్‌గాంధీ సమాధానం చెప్పాలని వారు నిలదీస్తున్నారు.

సంత్ సేవాలాల్ మార్గం స్ఫూర్తిదాయకం

సేవాలాల్ జయంత్యుత్సవాల్లో మంత్రి సీతక్క

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తేతెలంగాణ): బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ మార్గం ప్రతి ఒకరికీ స్ఫూర్తిదాయకమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క కొనియాడారు. ఆ మహనీయుడు బోధించిన అహింస, సమానత్వ భావనను అందరూ ఆచరించాలని పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్‌లోని బంజారా భవన్‌లో సేవాలాల్ మహారాజ్ జయంత్యుత్సవాల సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కతో కలిసి ఆమె సేవాలాల్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. బంజారాల భాషకు అధికారిక గుర్తింపు కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సేవాలాల్ జీవిత విశేషాలను భావితరాలకు అందజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీ బలరాంనాయక్, విప్ రామచంద్రు నాయక్, వ్యవసాయ కమిషన్ మెంబర్ రాములునాయక్, మాజీ ఎంపీలు రవీందర్‌నాయక్, వీ హనుమంతరావు, సింగరేణి సీఎండీ బలరాంనాయక్, కేంద్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మెంబర్ హుస్సేన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

భూవివాదంలో డోర్నకల్ ఎమ్మెల్యే

ప్రభుత్వ విప్ రాంచంద్రనాయక్‌పై కేసు

సూర్యాపేట, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ విప్, డోర్నకల్ శాసన సభ్యుడు డాక్టర్ రామచంద్రనాయక్‌పై భూవివాదంలో సూర్యాపేట పోలీసులు కేసు నమోదు చేశారు. గత నెలలో సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన గుండపునేని లక్ష్మీనర్సింహారావు (సుధాకర్‌రావు) తన స్థలంలో చెత్తను తొలగిస్తూ ఫెన్సింగ్ చేసుకుంటుండగా రామచంద్రనాయక్ అడ్డుకున్నాడు. దీంతో లక్ష్మీనర్సింహారావు 100కు డయల్ చేసి ఫిర్యాదు చేయడంతో పోలీసులు వచ్చారు. పోలీసులు సివిల్ మ్యాటర్‌లో తల దూర్చుతున్నారని ప్రభుత్వ విప్ కోర్టును ఆశ్రయించారు. లక్ష్మీనర్సింహారావు డయల్ 100కు కాల్ చేయడంతో తాము ఘటనా స్థలానికి చేరుకున్నామని, దౌర్జన్యం చేసిన ఘటనలో కేసు నమోదైందని, అందులో ఏ1గా బాషపంగు భాస్కర్, ఏ2గా డాక్టర్ రామచంద్రనాయక్ ఉన్నారని పోలీసులు కోర్టుకు విన్నవించారు. ఇదే భూమి విషయంలో 2016లో కూడా రాంచందర్‌నాయక్‌పై కేసు నమోదైంది.

నా పక్కనున్నోళ్లే పని చేయనిస్తలేరు

మొదటిపేజీ తరువాయి...

మాట్లాడుతున్న క్రమంలో అన్యాపదేశంగా రాష్ట్రంలో పరిస్థితి కూడా అందుకు భిన్నంగా లేదని, ఢిల్లీ నుంచి గల్లీ వరకు అలాగే ఉన్నదని పరోక్షంగా తన మంత్రివర్గ సహచరులపై అసహనాన్ని వ్యక్తం చేసినట్టు సమాచారం. దీంతో కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న పదవుల పంచాయితీ, గ్రూపు రాజకీయాల బండారం మొత్తం బట్టబయలైంది. సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనలో భాగంగా శనివారం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో భేటీ అయ్యారు. అనంతరం మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కొంత మంది మీడియా ప్రతినిధుల వద్ద కాంగ్రెస్‌లో నెలకొన్న అంతర్గత పోరుపై పలు కీలక వ్యాఖ్యలు చేసినట్టుగా తెలిసింది. ఇద్దరు, ముగ్గురు మంత్రులను ఉద్దేశించి ఈ వ్య